బిడ్డ తల్లిగా
ఈ సమాజంలో
బ్రతకలేననుకున్న
ఆమె ఏంచేసింది ?

# మాతృహృదయం




గొంతుదాకా నీటిలో మునిగి నెమ్మదిగా పైకి వస్తున్న విమ్మానంలా సముద్రగర్భంనుంచి పైపైకి వస్తున్నాడు బాలభానుడు.

మంచుకురిసిన బాటని లేకిరణాలు ఆ భవనంమీద పడ్డాయి. ఆ భవనం తెలీనివారికి ఓ రాజమహల్. తెలిసినవారికి నర్సింగ్ హోమ్.

"సమతా నర్సింగ్‌హోమ్" తెల్లని మొజాయిక్ మీద నల్లని అక్షరాలు.

సమానత్వం అక్షరాల పొందికలోనే. చేసే వైద్యంలో, వసూలుచేసే ఫీజుల్లో వుండదని అందరికీ తెలిసిన సత్యం.

నగరంలోకెల్లా అతి ఖరీదైన నర్సింగ్‌హోమ్. మొదటి తరగతివారికి తప్ప, మిగతా తరగతివారికి అందని ఖరీదులో వుంటుంది అక్కడి వైద్యం.

ఎటువంటి రోగానికైనా వైద్యంచేసి, నయంం చేయగలమనే ధైర్యం, గర్వం అక్కడి డాక్టర్ల కళ్లల్లో, మాటల్లో ధ్వనిస్తుంది.

మీగడ తరగల్లా, పంచదార చిలుకల్లా, తెల్లని దుస్తుల్లో అక్కడి నర్సులు, మనసు విప్పి పలికే తేనెపలుకులు ఎంతటివారికైనా కొంత ఊరట కలిగిస్తాయి. డాక్టర్స్ చేసే వైద్యం రోగాన్ని నయం చేస్తే వారి మాటలు మానసిక రుగ్మతల్ని వదిలిస్తాయి.

అది మూట పదమూడవ రూమ్. సుభద్ర ఊయలలోని బిడ్డవైపు చూస్తూ కూర్చుంది. ఆ చూపుల్లో జీవంలేదు. వ్యతలేదు. ప్రేమలేదు. జాలి లేదు. "ఎందుకు పుట్టావురా?" అవి ప్రశ్నిస్తున్నాయి.

అయిదు నిమిషాలు క్రితమే డాక్టర్ వచ్చి



చూసి వెళ్లాడు. తర్వాత సుబ్బారావు వచ్చాడు. భార్య కళ్లల్లో కన్నీరుచూసి చలించిపోయాడు. దగ్గరకు తీసుకుని ఓదార్చాడు. బాబు గురించి బెంగ వలదన్నాడు. అన్నిటికీ దైవమే వుందన్నాడు. మన అదృష్టం ఇంతేనని అన్నాడు.

భర్త ఓదార్పు సుభద్ర కన్నీటిని ఆపలేకపోయింది. గుండె గుబులు తీర్చలేకపోయింది

బిడ్డకోసం తపించే మాతృహృదయం విలవిల లాడిపోయింది. "ఎందుకు కన్నావు?" అని ఊయలలోని బిడ్డ అడుగుతున్నట్టుగా వుంది బాధతో ఆమె కనురెప్పలు మూసుకుంది. ఆమె ఆలోచనలు గతంలోకి జారుకున్నాయి.

■ ■ ■

బ్యాంకులో క్లర్క్‌గా పనిచేస్తున్న సుబ్బారావుతో సుభద్ర పెళ్లి అతినిరాడంబరంగా జరిగింది.

మొదటి సంవత్సరం సరదాగా భర్త సరస సంభాషణలతో చిలిపి పనులతో, అత్తమామల ఆదరాభిమానాలతో, మరదలు సరసంతో జరిగిపోయింది.

కోడలు సపర్యలతో చీకు చింతా లేకుండా ఆనందంతో తమ శేషజీవితాల్ని గడుపుతున్న రామయ్య, సీతమ్మలకి ఆ ఇంట్లో మరో ప్రాణి వుంటే బాగుణ్ను అనే ఆలోచన ఆశ కలిగింది. కోడలు కడుపున ఒక కాయ పండితే వాడ్ని ఆడిస్తూ, లాలిస్తూ వాడు చేసే అల్లరికి తాముకూడా నవ్వుతూ, తుళ్లుతూ హాయిగా జీవితాల్ని వెళ్లబుచ్చవచ్చు అనే ఆశతో వున్నారు.

కొడుకుతోపాటుగా పెళ్లి అయిన పక్కింటి వారమ్మాయి సంవత్సరం తిరక్కుండానే ఆరు నెలల కడుపుతో వచ్చిందని, వెనుకింటివారు సంవత్సరం క్రితం కాపురానికి వచ్చిన కోడల్ని పురిటికి పంపించారని తెలిసి సంతోషించారు. తమకు కూడా ఆ ఆనందం, సంతోషం ఎప్పుడు కలుగుతుందోనని ఎదురుచూడసాగారు.

"ఏమిటి సీతమ్మా! కోడలు ఏమైనా హడావుడి చేస్తుందా?"

"రామయ్యా! నీకొడుకు నిన్ను తాతని ఎప్పుడు చేస్తానంటున్నాడు?"

ఇంటికి వచ్చినవాళ్లు అడుగుతుంటే వారికి సమాధానంగా "అంత అదృష్టం మాకెక్కడిది? దేవికైనా పెట్టి పుట్టాలి" అని అత్తమామలు పెదవి విరచడం చూసి సుభద్ర మనసు చివుక్కుమనేది.

తనూ చూస్తుంది పెళ్లి అయిన సంవత్సరానికే పురిటికని కన్నవారింటికి వచ్చే ఆడవాళ్లని, అలా తనెందుకు కాలేదని ప్రశ్న ఉదయించింది.

ఓరోజు సుభద్ర వాష్ బేసిన్ దగ్గర వాంతి చేసుకుంది. ఒకటికాదు... రెండుకాదు. మూడుసార్లు. అది చూసిన సీతమ్మ, రామయ్య ఆ వాంతులేనని నిర్ధారించుకున్నారు. సాయంత్రం బ్యాంకునుండి వచ్చిన సుబ్బారావు విషయం తెలిసి భార్యను డాక్టర్‌కి తీసుకెళ్లి చూపిస్తే తెలిసింది అవి పైత్యపు వాంతులని.

సీతమ్మ, రామయ్యల ఉత్సాహం గాలితీసిన బెలూన్‌లా అయింది. కోడలంటే రుసరుసలు మొదలయ్యాయి. చీటికి మాటికి కసురుకుంటుండేవారు. లోలోపల తిట్టుకునేవారు.

ఆరు నెలలు గడిచాయి. సుభద్ర మరలా వాష్ బేసిన్ దగ్గర వాంతులు చేసుకుంది. ఇవికూడా పైత్యపు వాంతులేనని తేల్చిపారేశారు అత్తమామలు. డాక్టర్‌కి చూపిస్తే తెలిసింది సుభద్ర గర్భవతని.

ఇహ ఆ ఇంట్లో ఆనందానికి కొదవలేదు మా చెవులు పట్టి ఆడించే బుజ్జిగాడు

వస్తున్నాడని సీతమ్మ, రామయ్య తెగ సంతోషించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమని పుష్టికరమైన ఆహారం తినమని, బరువులు మోయవద్దని, ఇలా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కోడలుకి చెప్పారు.

"ఏంటోయ్ శ్రీమతి! పెరిలెక్ బేబీనిస్తావా? అముల్ స్ప్రే బాబునిస్తావా?" భార్యను రెండు చేతులతో వాటేసుకుని అడిగాడు సుబ్బారావు.

"అబ్బ పొండి" సిగ్గుతో ముఖాన్ని సుబ్బారావు గుండెల్లో దాచుకుంది.

"ఏది ఇటు చూడు... ఎందుకట సిగ్గు! ఇది సిగ్గుపడాల్సిన విషయమా?" సుబ్బారావు ఆమె చుబుకాన్ని పైకెత్తి అడిగాడు సుబ్బారావు.

సుభద్ర అర్థంకాక ఆశ్చర్యంగా కనుగుడ్లు తిప్పింది.

"అవునోయ్! మన పెళ్ళి అయి మూడు సంవత్సరాలయ్యాయి. ఇంతవరకూ మనకు పిల్లలు లేరని, పుట్టరని అందరూ అనుకుంటున్నారు. ఇప్పుడు ధైర్యంగా అడిగినవారికి, అడగనివారికి చెప్పేస్తాను... నా భార్య...."

"ఆ! ఆ! ఆగండి" సుబ్బారావు నోటికి చేయి అడ్డుపెట్టింది సుభద్ర.

"ఆపకు... నన్నాపకు. పెళ్ళికావలసినవారికి ఓ సందేశం ఇచ్చేస్తాను!" అన్నాడు సుబ్బారావు ఊగిపోతూ.

"ఏమిటండీ అది!?"

"పెళ్ళికిముందు ప్రేమించుకోండి. సినిమాలు చూడండి. పెళ్ళి అయిన వెంటనే పిల్లల్ని కని ఇచ్చేయండి మీ పెద్దవాళ్ళకు" సుబ్బారావు నాటకీయంగా అన్నాడు.

"సినిమాలా...! అవెందుకు చూడ్డం" ఆశ్చర్యపోయింది సుభద్ర.

"సినిమాలంటే ఏంటనుకున్నావు! ఒసే పిచ్చిదానా! సినిమాలంటే" అని లైట్ ఆర్పి ఆమెను దగ్గరకు తీసుకుని తనకు తెలిసింది చేశాడు "ఇది" అన్నాడు. "సీటినే ఇండోర్

## వంట

వంటవాడ్ని ఇంటర్వ్యూ చేస్తోంది లక్ష్మి.

"నువ్వు అన్ని రకాల వంటలూ చేయగలవంటావు?" అని అడిగిందామె.

"అంతేకాదండీ, ఒక్కో వంటకం రెండేసి రకాలుగా కూడా వండగలనండీ" అన్నాడు వంటవాడు.

"అంటే?"

"వచ్చిన బంధువులు వుండిపోయేటట్లూ, పారిపోయేటట్లూకూడా వండగలనండీ"

— శ్రీశారద (వ్రా. దేవుపల్లి)



గేవ్స్ అంటారు''

''ఛీ పాడు... ఇలాంటి సలహాలు సందే శాలే ఇవ్వండి జనం కర్రలు పట్టుకుని వస్తారు'' అంది సుభద్ర చిరుకోపంతో.

''ఓహో శ్రీమతి అతి పవిత్రమైన సృష్టికార్యాన్ని తప్పు పట్టున్నావ్'' అని ఆమెను తన బాహువుల్లో బంధించాడు.

సుభద్ర భర్త కౌగిట్లో ఇమిడిపోయింది. గువ్వలా ఒదిగిపోయింది.

సుభద్ర పుట్టబోయే బిడ్డకోసం ఇప్ప ట్నుంచే స్వెట్టర్ అల్లడం మొదలెట్టింది. అమూల్ స్ప్రే డబ్బామీది బాబులా తన బాబు వుండాలని, వెన్నముద్దలు తింటూ చిలిపిగా చూస్తున్న చిన్ని కృష్ణుడిలా వుండాల ని కలలు కంటుంది. ఆ తల్లి మనసు చాలా ఆనందంగా వుంది.

కాని ఆ ఆనందం, సంతోషం ఆ ఇంట్లో నిలవలేదు. ఆ రోజు నిజంగా దరిద్రపు రోజు. విధి పగబట్టిన రోజు. సుభద్ర మరదలు రజనితో కూర్చుని చైనీస్ చక్కర్స్ ఆడుతోంది.

అప్పుడొచ్చింది ప్రాణాలు తీసేంతటి నెప్పి. కడుపు నెప్పి. కడుపులో చేయిపెట్టి పేగులు మెలితిప్పినట్లు అయింది. సుభద్ర ఆ బాధ తట్టుకోలేకపోయింది. కింద పడి కడుపు చేత్తో పట్టుకుని కోడి పిల్లలా గింజుకుంటుంది. ''అమ్మా అమ్మా'' అని ఏడవసాగింది.

రజనికి ఏం చేయాలో అర్థం కాలేదు. అన్నయ్య బ్యాంకుకి వెళ్లిపోయాడు. తల్లిదం డ్రులు సినిమాకి వెళ్లారు. వదిన పరిస్థితి ఆమెను మరీ భయపెట్టింది. వెంటనే రిక్షాలో హాస్పిటల్‌కు తీసుకెళ్లి సుబ్బారావుకి ఫోన్ చేసింది.

విధి చాలా చిత్రమైనది. మనిషి జీవితం తో ఎప్పుడు ఏవిధంగా ఏ ఆట ఆడుకుంటు ందో నిజంగా ఎవ్వరికీ తెలియదు. మనిషి దేనిమీద ఆయితే మనసు పెంచుకుంటాడో, దేనికోసమైతే తపన చెందుతాడో దానినే కాకుండా చేస్తుంది. ఏమిటో మరి ఈ వింత ఆట!

''మిస్టర్ సుబ్బారావు! యుఆర్ వెరీ లక్కీ. ఏమాత్రం ఆలస్యం జరిగినా ఆమె ప్రాణానికే ప్రమాదం జరిగేది. ఆమెకు అబార్షన్ అయింది. ఆమె ఆరోగ్యం జాగ్రత్త ''

ఆ సంఘటన సుభద్ర మనస్సులో కల్లోలం రేపింది. ఆమెను బాగా కృంగదీసిది.

రామయ్య సీతమ్మల మనసుల్లో కల్మషం చేరుకుంది. అంతవరకూ దాగివున్న అజ్ఞాత వ్యక్తులు వారిలోంచి బయటకు వచ్చారు. కోడలంటే గిట్టడంలేదు. బిడ్డలు లేని గొడ్రాలని, దరిద్రపుగొట్టుదని, అలాంటి బతుకు బతికేకన్నా ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటే సరి మాకీ పీడ విరగడవుతాద ని బాహాటంగా తిట్టసాగారు.

ఒకపక్క కడుపుకోత. మరోపక్క ఇం ట్లో వారి ఛీదరింపులు. ఛీత్కారాలు. సుభద్ర చలించిపోయింది. ఇహ తనకు పిల్లలు పుట్టరేమోనని భయం పట్టుకుంది.

సుబ్బారావుభార్యను స్పెషలిస్ట్‌కి చూపిం చి, తనుకూడా చూపించుకున్నాడు. ఇద్దరి లో ఎటువంటి లోపం లేదు.

వినుగు విరామం లేక తిరుగుతున్న

కాలచక్రం అయిదు సంవత్సరాలు ముందుకు పరుగులు తీసింది.

ఈ కాలగమనంలో సుబ్బారావు క్లర్క్ నుండి ఆఫీసర్ అయ్యాడు. తండ్రిని పోగొట్టుకున్నాడు. చెల్లెలు రజనికి పెళ్లిచేశాడు. ఆమె ఇప్పుడు ఇద్దరు పిల్లలకు తల్లి.

"కోరి కోరి చేసుకున్నట్లయింది ముదనష్టపుదాన్ని. లోకంమీద ఆడవాళ్లే లేనట్టు! తన్ని తగలేసి అన్నయ్యకు మరో పెళ్లిచేస్తే దీని పొగరు అణుగుతుంది..." రజని పిల్లల్ని తీసుకుని కన్నవారింటికి ఎప్పుడొచ్చినా పెద్ద చిన్న అనే బేధం లేకుండా, వదిన అనే గౌరవంకూడా లేకుండా అసభ్య పదజాలంతో సుభద్ర మనసును నొప్పించేది.

"అన్నయ్యా! నీకెలాగు పిల్లలు లేరు. కలిగే భాగ్యం కూడా లేదు. నా మాట విని మరో పెళ్లి చేసుకో. లేకుంటే నా పిల్లల్లో ఎవర్నో ఒకర్ని పెంచుకో..."

చెల్లెలు తెలివితక్కువ తనానికి నవ్వాలో, ఏడవాలో సుబ్బారావుకి అర్థంకాలేదు. తను ఇంత ధైర్యంగా ఎదుట నిలబడి ఎలా మాట్లాడగలుగుతుంది!? నాకు సలహా ఇచ్చేంతటి ఎత్తుకు ఎలా ఎదిగిపోయింది? అని ఆశ్చర్యపోతున్నాడు. బహుశా ఈ ఇంటికి ఆడబిడ్డననే హోదా కావచ్చు. నీ భార్యకన్నా నేను ఎంతో మిన్న. ఇద్దరు పిల్లల తల్లిననే గర్వం కావచ్చు.

నిజానికి దేవుడున్నాడో... లేడో... తెలియదు. ఉన్నట్లయితే మోడువారిన జీవితాల్లో వసంతాలు కురిపిస్తాడని సుభద్ర నమ్మకం. తన జీవితం చీకటి మయమని, ఈ జన్మలో పిల్లలు పుట్టే యోగం లేదని, బోసినవ్వులు చూసే అదృష్టం లేదని పూర్తిగా నిర్ధారణ చేసుకుంది. నిర్జీవంగా బ్రతకడం నేర్చుకుంది. అటువంటి సమయంలో నీవు గర్భవతివి అని చెప్పిన నల్లిని మాట మూగవోయిన ఆమె గుండె వీణను

## ఆగిన గుండె



న్యూజిలాండ్ ఇంగ్లాండ్‌ల మధ్య 1975లో అడ్లాయిడ్ టెస్ట్ పందెం జరుగుతున్నప్పుడు వేగంగా వచ్చిన ఓ బంతి అతని హృదయానికి గట్టిగా కొట్టుకోవడంతో కొన్ని సెకండ్లు అతని గుండె ఆగిపోయింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారనుకోండి. అలా ఆడుతూ గుండె ఆగి తిరిగి బ్రతికిన ఏకైక క్రికెటర్ న్యూజిలాండ్‌కి చెందిన ఎ.ఇ.చాట్‌ఫీల్డ్.

— అచ్యుతుని రాజ్యశ్రీ

ప్రమోగించినట్లయింది. ఆమెలో అణిగివున్న మాతృహృదయం కెరటంలా ఉవ్వెత్తున లేచింది.

సెకన్లు నిమిషాలై, నిమిషాలు గంటలై, గంటలు రోజులై, రోజులు వారాలై, వారాలు నెలలై కాలం సాగుతోంది.

నెలలు గడుస్తుంటే నెలలు నిండుతుంటే సుభద్ర ఆనందం జలప్రవాహంలా వుంది. నెలనెలకి పైపైకి వస్తున్న కడుపును చూసి మురిసిపోతోంది. తన్మయత్వంతో చేతులతో తడుముకుంది. ఈసారైనా తనను కరుణించమని దేవుణ్ణి మనసారా వేడుకుంది. లేక లేక కలిగిన ఆ గర్భానికి సరిగా ఆరు నెలలు నిండుకున్నాయి.

ఆరోజు వారి పెళ్లిరోజు. సరిగ్గా పది సంవత్సరాలు మొదటి రెండు మూడు సంవత్సరాలు కాస్త అట్టహాసంగా జరుపుకున్నారు. మరలా ఈసారి. ఈసారి పెళ్లిరోజుకి ఒక విశేషం కూడా వుంది. అదే... ఆ దంపతులు త్వరలో తల్లిదండ్రులు కాబోతున్నారు. అందుకే వారి ముఖాల్లో వెయ్యి ఫ్లడ్‌లైట్ల కాంతి విరుస్తుంది.

ఆ రాత్రి సుభద్ర శోభనంనాటి తెల్లచీర, జాకెట్టు ధరించి, నల్లని కురుల్లో మల్లెలు తురిమింది. కల్మషం లేని ప్రేమ, అభిమానం పంచే భర్త గుండెలపై వాలిపోయింది. కనులు మూసుకుని తన్మయత్వంతో తను చెప్పే తీయని కబుర్లు వింటుంది.

ఆ ఆనంద సమయంలో వున్నట్టుండి ఆమె మెలికలు తిరిగిపోసాగింది. కడుపుమీద సుత్తితో కొట్టినట్లు నెప్పులు ప్రారంభమైనాయి. నెలలు నిండకుండానే నెప్పులు రావడం కాస్త ఆశ్చర్యం వేసినా, ఆ బాధ ఆమెను ఆలోచించనివ్వడంలేదు.

క్షణం క్రితం గువ్వలా గుండెమీద ఒదిగిపోయిన భార్య ఇప్పుడు రెక్కలు తెగిన పక్షిలా గిజగిజలాడడం చూసి సుబ్బారావుకి ముచ్చెమటలు పోసాయి. గతంలో అబార్షన్ అయిన విషయం జ్ఞప్తికి వచ్చింది. డబ్బుకోసం చూడకుండా టాక్సీ తెచ్చి భార్యను సమతా నర్సింగ్ హోమ్‌లో చేర్పించారు.

తెలివి వచ్చాక చూసుకుంది సుభద్ర. తన శరీరం చీల్చుకు పుట్టిన బిడ్డను. మరుక్షణం స్పృహతప్పింది.

m n m

గతాన్ని నెమరువేసుకున్న ఆమె భారంగా నిట్టూర్పు విడిచింది. ఆ గదిలో వుంటే ఆమెకు పిచ్చెక్కినట్లవుతుంది. ఉయ్యాల్లో సవ్వడి లేకుండా పడి వున్న బిడ్డ గొంతు పిసికి చంపేయాలన్నంత కోపం వస్తుంది. ఏ రాక్షసుడో తన కడుపున పుట్టాడని ఆమె భోరున రోదిస్తోంది.

ఆరోజు శివరాత్రి. శివాలయం నెత్తిమీదనున్న సూర్యుడు మెల్లమెల్లగా కిందికి దిగుతుంటే రక్తంతో తడిసిన బంతి కిందికి జారుతున్నట్లుగా వుది. శివపురాణం స్పీకర్లనుండి గాలి తెరలు తెరలుగా మోసుకొస్తోంది.

గది కిటికీనుండి చూస్తున్న సుభద్రకి రోడ్‌కవతల వున్న శివాలయం దగ్గర దృశ్యం అస్పష్టంగా కనిపిస్తోంది. కాళ్లులేని కుంటివాళ్లు, కళ్లులేని గుడ్డివాళ్లు వచ్చే పోయే భక్తుల ముందుకి వారి వారి బొచ్చెల్ని చూపుతూ అడుక్కుంటున్నారు. మరో దృశ్యం ఆమె కనులముందు కదలాడింది. మరుక్షణం ఆమె చూపుకి నీటిపొర అడ్డొచ్చింది. కళ్లల్లో నీరు గిర్రున తిరిగింది. అది ఆమె మనసు ఊహించుకునే భయంకర దృశ్యం.

"భగవాన్! ఎందుకయ్యా నన్నిలా శిక్షిస్తావ్? నేనేం పాపం చేశానయ్యా! ఇప్పుడు నన్నేం చేయమంటావ్? తల్లిగా వాణ్ణి పెంచి లోకం చేసే అవహేళనకి గురిచేయమంటావా? లేక పీకపిసికి పారవేయమంటావా? చెప్పవయ్యా... చెప్పు? ఈ పండుగరోజున వాడ్ని నీలో కలుపుకోస్వామీ. మళ్లీ జన్మకైనా వాడికి మంచి జన్మనివ్వు స్వామీ!"

సుభద్ర దేవుణ్ణి తిట్టుకుంటూ, వేడుకుంటూ ఊయల దగ్గరకి వచ్చింది. అప్పటికే ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది.

వారం రోజుల క్రితం పుట్టిన బిడ్డని తనివితీరా చూసుకుంది.

'కంటి రెప్పలు మూసుకుని వున్నాయ్. వాటికి చూపులేదు. చెవులు పూర్తి ఆకారాన్ని పొందలేదు. వాటికి శ్రవణశక్తి లేదు. ముక్కు వుండవలసిన స్థానంలో చిన్న రంధ్రం వుంది. ఊపిరి పీల్చుకోవడానికి అన్నట్లు. నోరు పెద్దదిగా వుంది. చేతులు పొట్టిగా, ఒక కాలు సగమే వుంది.

"ఒరేర్ బాబూ! నీకు జన్మనిచ్చిన తల్లినిరా! ఒక్కసారి చూడరా! ఒక్కసారి నీకింతటి అందమైన రూపాన్నిచ్చిన ఈ తల్లిని చూడరా! హు... నా మాటలు నీకు వినిపించవురా. నా రూపం నీకు కన్పించదురా. బ్రతికినన్నాళ్లూ నీ తల్లిని, నీ జన్మను తిట్టుకుంటూ బ్రతికే బ్రతుకు దుర్భరంరా. అందుకేరా నిన్ను చంపేస్తాను. చచ్చిపోరా! ఈ వైద్యులు, ఈ విజ్ఞానం నిన్ను మామూలు మనిషిని చేయలేవురా... కాని కాని ఈ మనుషులు బ్రతికినన్నాళ్లూ నిన్ను కాకుల్లా పొడుచుకు తింటార్రా. చచ్చిపోరా! చచ్చిపో. మళ్లీ జన్మంటూ వుంటే ఈ తల్లి కడుపున మాత్రం పుట్టకురా"

సుభద్ర తన కుడిచేతిని లేక లేక ప్రేగు తెంచుకుని పుట్టిన బిడ్డ ముఖంపై వేసి బలంగా నొక్కసాగింది. ఊపిరాడని ఆ బిడ్డ కాళ్లు చేతులు కొట్టుకుంటుంటే "అమ్మా! చంపకమ్మా! చంపకమ్మా!" అని అర్థిస్తున్నట్లుగా వుంది. అయినా ఆ తల్లి మనసు కరగలేదు. ఆ మాతృహృదయంలో జాలి, సానుభూతి, కరుణ, మమత, మధురిమ ఇవేవీ లేవు. చేతిలోకి బలం అంతా కూడదీసుకుంది. అంతలో.... అంతలో... ఆమెలో ఏదో అలజడి ప్రారంభమైంది. గుండెల్ని ఎవరో పిండుతున్నట్లయింది. ఏదో అజ్ఞాత శక్తి తన చర్యను ప్రతిఘటిస్తున్నట్లుగా వుంది. గుండె పొరల్లో ఏదో తెలియని తపన, దయ, అపేక్ష, ఆర్ద్రత, అనురాగం కలిగింది. మాతృత్వం ఆమె నరనరాల్లో ప్రవహించసాగింది.

మరుక్షణం సుభద్ర తన చేతిని వెనక్కి తీసేసుకుంది. రెండు చేతులతో తన కన్నబిడ్డని ఎత్తుకుని గుండెలకి హత్తుకుంది. "నిన్ను చంపనురా కన్నా! చంపను. నీవే నా ప్రాణం. ప్రేమామృతాలతో ముంచెత్తుతున్న సుభద్ర గుండె చటుక్కున ఆగినట్లయింది. కళ్లు పెద్దవి చేస్తూ చూసింది. చేతిలో బిడ్డవైపు. అప్పటికే ఆమె పైశాచికత్వానికి బలైన ఆ మృతశిశువు 'నీ కోరిక తీరిందా అమ్మా?' అని అడుగుతున్నట్లుగా వుంది.

ఆ మాతృహృదయం ఘోరున విలపిస్తోంది. ఆమె కన్నులనుండి రెండు కన్నీటిచుక్కలు ఆ బిడ్డ బుగ్గలపై పడి ముత్యాల్లా మెరుస్తున్నాయి బైటి కాంతిలో.

* * *
*